ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కుమరం భీం
జిల్లా వార్తలు
8
మంగళవారం 18 మార్చి 2025

డైట్ కళాశాల తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీనిధి డైట్ కళాశాలను సోమవారం ఆదిలాబాద్ జిల్లా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఛాత్రో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరు పేషియల్ రికగ్నిజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ నమోదు చేయాలన్నారు. రికార్డులు రాయాలని, టీచింగ్ ప్రాక్టీస్ చేయాలని, అన్ని సబ్జెక్టుల మీద అవగాహన ఉండాలన్నారు. ఆయన వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

దహెగాం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కల్వాడ, గిరివెల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం మాజీ జడ్పీటీసీ శ్రీరామరావు భూమి పూజ నిర్వహించారు. అంతర్గత రహదారుల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఐదు లక్షల రూపాయలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రీనివాస్, భీమన్న, వెంకన్న, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు మార్పు సరికాదు

కౌటాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అమర జీవి పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరును మార్చి సురవరం సుధాక ర్‌రెడ్డి పేరును పెట్టడం సరికాదని ఆర్యవైశ్య మహాసభ గ్రామీణ కార్యదర్శి వొజ్జల వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి దేశభక్తుడు పొట్టి శ్రీరాములు పేరు తీసి వేయడం సరైంది కాదన్నారు. నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఆర్యవైశ్య మహాసభ కౌటాల మండల అధ్యక్షుడు ఎల్క సిద్దేశ్వర్, కార్యదర్శి గోపిశెట్టి అనిల్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాకలు పూర్తయ్యేనా?

- జిల్లాకు 250 షెడ్లు మంజూరు
- ఇప్పటివరకు 40 శాతం మాత్రమే పూర్తి
- గడువులోగా పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు



వాంకిడి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులు, కోళ్ల పెంపకందారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం రాయి తీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీలో వందశాతం రాయితీతో పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలోని రైతులు షెడ్లు నిర్మించు కునేందుకు ముందుకు వస్తున్నా నిర్మాణపు పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. మంజూరైన వాటిలో సగం మాత్రమే నిర్మాణాలు పూర్తిగా చేపట్టగా మిగిలినవి ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిధుల విడుదలలో నిబంధనలు క్షేత్రస్థాయిలో నిర్మాణాల పురోగతికి ప్రధాన ప్రతి బంధకాలుగా మారుతున్నాయి. కూలీల వేతనం 1,081 రూపాయలు మినహా మిగిలిన నిధులన్నీ నిర్మాణం పూర్తయ్యాకే అందిస్తుండటంతో లబ్ధిదారులు వీటి నిర్మాణాలపై ఆసక్తి చూపడంలేదు. ఈ నెలాఖరు ఆర్థిక సవత్సరం పూర్తవుతుండటంతో వందశాతం నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

నిబంధనలు ఇవీ..

- షెడ్డు మంజూరుకు ఉపాధిహామి జాబ్‌కార్డు ఉండాలి. దీంతో పాటు అయిదేకరాల్లోపు భూమి, తప్పనిసరిగా మూడు పశువులు ఉండాలి. నిర్మాణానికి స్థలం ఉండాలి.
- గ్రామసభ తీర్మానం అవసరం
- నిర్మాణం పూర్తయిన తర్వాతే 85 వేల రూపాయలు అందిస్తారు.

● ప్రతీ మండలంలో షెడ్ల నిర్మాణాలు..

ప్రభుత్వం ఉపాధిహామీ పథకం, ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలోని ప్రతి మండలంలో షెడ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు పశువుల షెడ్లు మంజూరుచేస్తూ నిధులను విడుదల చేసింది. కోళ్ల షెడ్లను సైతం ప్రతీ మండలంలో తప్పనిసరిగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పశువుల షెడ్డుకు ఒక్కో దానికి రూ. 85 వేల రూపాయలను వందశాతం రాయితీతో రైతులకు అందిస్తున్నారు. కోళ్ల షెడ్లకు ఒక్కో దానికి రూ. 2.90 లక్షల వరకు నిధులను అందజేస్తున్నారు. దీనికి రైతులు స్థలం, పశువులు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండల పశువైద్యాధికారుల చేత ధ్రువీకరించాలి. ప్రభుత్వం వీటి నిర్మాణాలకు నిధులు వందశాతం ఇస్తున్నా ప్రజల్లో సరైన అవగాహన లేని కారణంగా రైతులు, మహిళలు ఆశించిన మేరకు ముందుకు రావడంలేదు.

● 250 షెడ్లు మంజూరు..

జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 250 షెడ్లు మంజూరయ్యాయి. ఇందులో 202 పశువుల షెడ్లు, 31 మేకలు, గొర్రెల షెడ్లు, 17 పౌల్ట్రీ షెడ్‌లు మంజూరయ్యాయి. 202 పశువుల షెడ్లకు కోటి 87 లక్షల రూపాయలు, మేకలు, గొర్రెల షెడ్లకు 39 లక్షల రూపాయలు, పౌల్ట్రీ షెడ్లకు 40 లక్షల రూపాయలను కేటాయించారు. ఇప్పటివరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తి కాగా మిగితా షెడ్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా నిర్మాణ దశల్లో ఉన్న షెడ్లను ఈ నెలాఖరులోగా వందశాతం పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు నిర్మాణ దశలో ఉన్న షెడ్లను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు..

శ్రావణ్, ఏపీవో - వాంకిడి



రైతులకు, పశుపోషకులకు ప్రోత్సాహకరంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకాన్ని ప్రత్యేక కార్యాచరణతో చేపడుతున్నాము. మార్చి 31 నాటికి అన్ని పనులూ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాము. నిర్మాణ దశలో ఉన్న షెడ్లను వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాము. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరుకోసం ప్రతిపాదనలు పంపిస్తాము. మహిళలు, రైతులు పశువుల షెడ్ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలి.

భగత్‌సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత పాలకులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన

కెరమెరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్లాట్ల యజమానులకు ఎల్ఆర్ఎస్‌పై ఎంపీడీవో అంజద్‌పాషా సోమవారం అవగాహన కల్పించారు. హట్టి గ్రామ శివారులో ఉన్న ప్లాట్లకు సంబంధించి కొనుగోలు చేసిన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎల్ఆర్ఎస్ ప్లాట్లకు సంబంధించి ప్రభుత్వానికి ఈ నెల 31లోగా రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ కల్పించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వం కల్పించిన రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషిచేయాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు..

● రెబ్బెన మండలం గోలేటికి చెందిన మల్లయ్య తాను పుట్టుకతో దివ్యాంగుడినని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

● వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఎర్ర లక్ష్మీకాంత్ తనకు గిరి వికాసం పథకం కింద మంజూరైన బోరుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

● ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన మొగిలి తాను సాగు చేస్తున్న పోడు భూమిని సర్వే నిర్వహించి పట్టా మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

● బెజ్జూరు మండలం కుకుడ గ్రామానికి చెందిన మెరుగు రమేష్ తమ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనం మరమ్మతులు చేపట్టాలని దరఖాస్తు అందజేశారు.

● కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓంకార్ అభిలాష్ తన తండ్రి పేరిట దహెగాం మండలం కమ్మర్‌పల్లి శివారులో గల లావుని పట్టా భూమి కొందరు ఆక్రమించుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

● హన్మకొండ జిల్లాకు చెందిన మీర్ సలీం అలీ తనకు కౌటాల మండలం మొగడ్‌దగడ్ గ్రామ శివారులో ఉన్న పట్టా భూములకు పట్టాదారు పాసు పుస్తకం జారీ చేయాలని కోరారు.

● కౌటాల మండల కేంద్రానికి చెందిన తేలుకుంట్ల పుష్ప తనకు చెందిన ఇంటి స్థలంలో ఇతరులు వచ్చి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయలో న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

● రెబ్బెన మండలం పాసిగాం గ్రామానికి చెందిన శాంతబాయి తనకు గల పట్టా భూమి దరణి పోర్టల్‌లో మిస్సింగ్ అయినందున తగు చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు.

● ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన చంద్రి లక్ష్మణ్ తమ తల్లి మరణించిందని తనకు వారసత్వ ధ్రువపత్రం జారీ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.

బాధితులకు అండగా భరోసా సెంటర్

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బాధితులకు అండగా జిల్లా భరోసా సెంటర్ సేవలు అందిస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉమెన్ సేఫ్టీ వింగ్ ద్వారా వచ్చిన విక్టమ్ అసిస్టెంట్ ఫండ్‌ను బాధిత మహిళలైన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.60 వేల చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని, మెడికల్ ఎగ్జామినేషన్‌లో కూడా బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. భరోసా ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు సేవలు, కౌన్సెలింగ్, వైద్య, న్యాయసేవలు అందిస్తామన్నారు. భరోసా సెంటర్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో మహిళలకు, చిన్న పిల్లలు బాధింపబడినట్లయితే తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. బాధితులు 8712670561 నంబర్‌కు లేదా 100 ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించవచ్చని సూచించారు. క్యాక్రమంలో భరోసా సెంటర్ ఇన్‌చార్జి మహిళా ఎస్సై తిరుమల, లీగల్ సపోర్టర్ పర్సన్ శైలజ, డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆర్ఐ పెద్దన్న, సీసీకిరణ్‌లు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

● ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ప్రజావాణి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. వారివారి సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు సహకరిస్తారని తెలిపారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిష్కరిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందని అన్నారు. ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి

- అదనపు ఎస్పీ చిత్తరంజన్



వాంకిడిలో విద్యార్థినికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి/వాంకిడి మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లోనుకాకుండా పరీక్షలు రాయాలని అదనపు ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. సోమవారం ఆయన కెరమెరి మండలం మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాల, వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరీక్షలంటే భయపడకూడదన్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కృషి, తపన, పట్టుదల, సమయపాలన విజయానికి ముఖ్య సూత్రాలు అవుతాయన్నారు. విద్యార్థులు ఎటువంటి భయం ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఒక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. మోడి ఆశ్రమ కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాలలు, కెరమెరి, గోయగాం ఆశ్రమ పాఠశాలలు, హట్టి, అనార్‌పల్లి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, బాటిల్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు విజయ్, ప్రశాంత్, ఎంఈవోలు ప్రకాష్, వివచరుణ్‌కుమార్, వాంకిడి పాఠశాల హెచ్ఎం నటరాజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై అందించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు జీరాక్స్ కాపీలు జత చేసి స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు నాగలి, కల్టివేటర్లు, రోటవేటర్, ట్రాక్టర్ పనిముట్లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్, పవర్ టిల్లర్, బ్యాటరీస్ ప్రేయర్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్థిక సంవత్సరానికి గాను వంద శాతం మహిళలకు వ్యవసాయ పని ముట్లు అందించనున్నట్లు తెలిపారు.

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వం విఫలం


- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం

కౌటాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. కౌటాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రాణహిత ప్రాజెక్టు చేపడుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేడు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదని పేర్కొన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో రూ200 కోట్లు ప్రాజెక్టుకు కేటాయించినట్లు చెప్పి వాటి ఊసే ఎత్తడంలేదని ఆ డబ్బులు ఎటు పోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టుపై సరైన నిర్ణయం తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రాంత రైతులు ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయి అన్ని విధాల నష్టపోయారన్నారు. ఉన్న భూములకైనా నీళ్ల వస్తాయని ఎదురు చూస్తుంటే ఆ ప్రాజెక్టు కాస్త కాళేశ్వరానికి తరలిపోయిందన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టుకు అన్యాయం చేసిందన్నారు. గ్రూపు-1 తెలుగు మీడియం విద్యార్థులకు తీవ్రఅన్యాయం జరిగిందని ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలనితి సూచించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో ఓడిపోతామని భయపడే ఎన్నికలకు పోవడం లేదని విమర్శించారు. ఆయన వెంట నాయకులు రాజేందర్‌గౌడ్, విజయ్, రవి, అశోక్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అజ్మీర శ్యాంనాయక్

ఆసిఫాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు రోల్‌మోడల్‌గా నిలవాలని అంతే గాని ఇలా సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఆయన వెంట నాయకులు సోమయ్య, నిజాం, మురళీ, శంకర్, సత్తన్న, జక్కన్న, రవీందర్, రవినాయక్, అన్నారావు, బాలేష్, పరుశురాం, తిరుపతి, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రజల్లోకి 'వన్ నేషన్ వన్ ఎలక్షన్'



సమావేశంలో మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లోకి వన్ నేషన్ వన్ ఎలక్షన్ తీసుకువెళ్లేందుకు విస్తృత ప్రచారం చేస్తామని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో పాటు కేబినేట్‌లోనూ తీర్మానం చేశారని తెలిపారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు సురేష్, జయరాజ్, ప్రసాద్‌గౌడ్, న్యాయవాది దీపక్ తదితరులు ఉన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

- డీఎల్‌పీవో ఉమర్ షరీఫ్

కెరమెరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు పూర్తి చేయాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ సూచించారు. సోమవారం ఆయన కెరమెరి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూలును ఈ నెలాఖరులో పూర్తిచేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించి పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి గణేష్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఉమర్ షరీఫ్

డీఎంగా బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కేవీ రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌సీయూ డిపోలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఆసిఫాబాద్ డీఎంగా ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన విశ్వనాథ్ బదిలీపై బోధన్ డిపోకు వెళ్లగా ఆయన స్థానంలో రాజశేఖర్ వచ్చారు.



డీఎం రాజశేఖర్

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

రెబ్బెన, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఆణిముత్యాలుగా, భావి పౌరులుగా తీర్చిదిద్దేది కేవలం ఉపాధ్యాయులేనని సింగరేణి హైస్కూల్ కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి అన్నారు. సోమవారం స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయులు చేతుల్లోనే విద్యార్థుల బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్లుగా ఉపాధ్యాయునిగా సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న వేణుమనోహర్ సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వేణుమనోహర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్ల రెడ్డి, బాబునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

శకుంతల, జీసీడీవో



ఆంధ్రజ్యోతి: పదో తరగతి విద్యార్థులపై ఎలాంటి దృష్టి సారిస్తున్నారు?

జీసీడీవో: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?

జీసీడీవో: ప్రత్యేక తరగతులను నిర్వహించడమే కాకుండా గత నవంబరు, డిసెంబరు నెలలో స్లిప్ టెస్టులను నిర్వహించాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ఎలాంటి మెనూ పెడుతున్నారు?

జీసీడీవో: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక మెనూ పాటిస్తున్నాం. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గత జనవరి నుంచి ప్రత్యేక మెనూ పాటిస్తున్నాం.

- ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి)

వార సంత.. సమస్యల చింత

- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు



నేలపై కూర్చొని క్రయవిక్రయాలు చేస్తున్న వ్యాపారులు, కొనుగోలుదారులు

చింతలమానేపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్రనగర్ గ్రామంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే సంతలో కనీస సౌకర్యాలు లేక వినియోగదారులకు, వ్యాపారులకు మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ సంవత్సరం ఈ సంతకు 3.50 లక్షల రూపాయలకు పైగానే ఆదాయం వస్తుంది. ఈ సంవత్సరం కూడా అంతకు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతీ సంవత్సరం లక్షల ఆదాయం వస్తున్నా, సంబంధిత అధికారులు సంతలో ఎలాంటి వసతులు కల్పించపోవడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో ప్రతీ బుధవారం సంత జరుగుతుంది. ప్రధాన రోడ్డుపైనే వార సంత నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా పూర్తి సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి..

శుక్రవారం రవీంద్రనగర్ వార సంతకు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ తదితర పట్టణాల వ్యాపారులతో పాటు మండలంలోని 20 గ్రామాల ప్రజలు, సిర్పూర్ (టి), బెజ్జూర్, కౌటాల మండలాల్లోని మరో 20 గ్రామాల వినియోగదారులు, వ్యాపారుల, ప్రజలు నిత్యావసర సరకుల కోసం ఇక్కడికి వస్తుంటారు. కనీసం మరుగుదొడ్లు, తాగునీరు కూడా ఏర్పాటు చేయడం లేదని వినియోగదారులు, వ్యాపారులు వాపోతున్నారు. వార సంతకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు వస్తుంటారు.

ట్రాఫిక్ సమస్య..

వారసంత రోజున ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనక్కునేందుకు ఆటోలు, జీపులు, ఇతర వాహనాల్లో వస్తుంటారు. ఈ వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుపైనే నిలపడం వల్ల ట్రాఫి క్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు మండల వ్యాపా రులతో పాటు, కాగజ్‌నగర్, కౌటాల, సిర్పూర్ (టి) మండలాల వ్యాపారులు సరకులను వాహనాల్లో తీసు కొస్తారు. వ్యాపారుల వాహనాలకు రక్షణ లేకపోవడంతో ఆ వాహనాన్నింటినీ సంతలోనే పార్కింగ్ చేస్తున్నారు. వ్యాపారాలు చేసుకోవడానికి ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే వ్యాపారాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించాలని, మండల ప్రజల సమస్యలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.



కనీస సౌకర్యాలు కల్పించాలి..

గంగాధర్, వినియోగదారుడు

మండలంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వార సంతలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కనీస సౌకర్యాలైన తాగు నీరు, మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి..

తిరుపతి, ఆటో డ్రైవర్

శుక్రవారం సంతకు ఎక్కువగా వాహనాలు వస్తూ ఉంటాయి. ప్రత్యేకంగా వాహనాలకు పార్కింగ్ స్థలం లేక పోవడంలో వాహనాలు అన్ని రోడ్డుపైనే నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయిస్తే బాగుంటుంది.



ప్రమాదవశాత్తు కింద పడి రిటైర్డు కార్మికుడి మృతి

కాసిపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవాపూర్‌కు చెందిన గసికంటి రాజయ్య (65) అనే రిటైర్డ్ కార్మికుడు ప్రమాదవశా త్తూ కింద పడి మృతిచెందాడు. కుటుంబీకులు, ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో లోడింగ్ కార్మికుడి గా పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం హాజీపూర్ మండ లం నబ్బేపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న తన కుమారుడు గసికంటి మల్లేష్ ఇంటివద్ద జరిగిన శుభకార్యం కోసం దేవాపూర్‌కు వచ్చాడు. గతంలో రాజయ్యతో కలిసి పనిచేసిన సోనేరావును కలవడానికి సైకిల్‌పై కొత్తగడ్‌పూర్‌కు వెళ్లాడు. రాత్రి దేవాపూర్‌కు తిరిగి వస్తున్న క్రమంలో సైకిల్ పైనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడు రాజయ్య కుమారుడు గసికంటి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష.. రూ. నాలుగు లక్షల జరిమానా

చెన్నూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు నాలుగు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ చెన్నూరు మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి సోమవారం తీర్పునిచ్చారు. భూపాలపల్లి జిల్లా మహాదేవాపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన సోమనపల్లి దేవేందర్‌కు మంచిర్యాలకు చెందిన చీపురుశెట్టి దినపతి చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును దేవేందర్ బ్యాంకులో వేయగా చెక్ బౌన్స్ అయ్యింది. దీంతో దేవేందర్ 9-5-2019న చెన్నూరు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావడంతో దినపతికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు నాలుగు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పును వెల్లడించారు.

లిఫ్ట్ ఇచ్చి చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాల క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తా వద్ద ఒకరికి లిఫ్ట్ ఇచ్చి బెదిరింపులకు పాల్పడి బంగారు చైన్‌ను చోరీ చేసిన మహ్మద్ సమీర్, మహ్మద్ జుబేర్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. సోమవారం చోరీకి సంబంధించిన వివరాలను ఆయన కార్యాల యంలో వెల్లడించారు. ఈ నెల 14న ప్రభుత్వ ఉద్యోగి ప్యాగ పోచం ఓ బార్‌లో మద్యం సేవించి బెల్లంపల్లి చౌరస్తాకు వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చాడు. సంజీవయ్య కాలనీకి చెందిన మహ్మద్ సమీర్ వాహనంపై ఎక్కించుకున్నాడు. ఎక్కడ దిగాలని అడుగుతూ కొంచెం ముందుకు వెళ్లగానే అతని స్నేహితుడు జాఫర్‌నగర్‌కు చెందిన మహ్మద్ జుబేర్ వెను కాల ఎక్కాడు. కొంతదూరం వెళ్లాక లక్షెట్టిపేట వైపునకు నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లారు. అతన్ని కత్తితో బెదిరిం చి మెడలోని చైన్‌ను తీసుకొని పారిపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి చైన్‌ను లాక్కున్నారని ఫిర్యాదు చేశాడు. పట్టణ ఎస్ఐ ప్రమోద్‌రావు, ఎస్ఐ ప్రవీణ్ క్రైం పార్టీ సిబ్బంది ఉపేందర్, కానిస్టేబుల్ మహేశ్, సుబ్బా రావు, లక్ష్మణ్‌లు సీసీ ఫుటేజీని పరిశీలించి నేరస్తుడి బైక్‌ను గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుం చి బైక్‌తో పాటు బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

విద్యార్థుల 'మాతృవందనం'



తల్లిదండ్రుల పాదాలను కడుగుతున్న విద్యార్థులు

దహెగాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుశీల ఆధ్వర్యంలో సోమవారం మాతృవందనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాదపూజ నిర్వహించి తల్లిదండ్రుల గొప్పదనం గురించి వివరించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులు అందించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఏడు ఎద్దులు పట్టివేత

సిర్పూర్(టి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం రాజారాంపల్లి నుంచి జగిత్యాలకు సోమవారం అక్రమంగా ఏడు పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేపట్టామన్నారు. ఈక్రమంలో కౌటాల నుంచి వస్తున్న వ్యాన్ (టీఎస్20 టి 6861)లో తనిఖీ చేయగా ఏడు పశువులు పట్టుబడ్డాయ న్నారు. దీంతో డ్రైవర్ ధనియాల లచ్చన్న, పశువుల యజ మాని యాగం తాండ్ర సత్తయ్య, వాహనం యజమాని షేక్ షాజావుద్దీన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కాగజ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-కోసిని ప్రధాన రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన తరుణ్(24) సోమవారం ఉదయం మృతి చెందారు. సిర్పూరు(టి) నుంచి కాగజ్‌నగర్‌కు వస్తున్న బులెరో వాహనం అతివేగంగా తోపుడు బండి యాజమాని మహబూబ్‌ఖాన్(52) అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తరుణ్‌తో పాటు మరో ఇద్దరికి కూడా గాయాలు కాగా, తరుణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సోమవారం ఉదయం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్టు ఎస్సై వివరించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు అతి వేగంగా బులెరో వాహనాన్ని నడిపిన డ్రైవర్ షహబాజ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రత్యామ్నాయ పద్ధతులపై అవగాహన

సిర్పూర్(టి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి అవసరాల కోసం అడవిపై ఆదార పడకుండా ప్రత్యామ్నాయ, శాశ్వత పద్ధతులను అవలంబించాలని మాలిని గ్రామస్థులకు బీట్ ఆఫీసర్ అరుణ్‌రెడ్డి సూచించారు.

సోమవారం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలపకు బదులు సిమెంటు పిల్లర్లు, ఐరన్ రాడ్లు ఉపయోగించి ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇంటి అవసరాలకు సిమెంటు పిల్లర్లు, ఐరన్ రాడ్లు ఉపయోగించిన వారిని ప్రశంసించి దానికి అయిన ఖర్చు వివరాలను కనుక్కొని గ్రామస్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ఆసిఫాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ను క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. ఇందులో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని తెచ్చిందని తద్వారా ఐసీడీఎస్ మూతపడే పరిస్థితికి దారి తీస్తాయమన్నారు. కేంద్రం చేసిన నిర్ణయాలను రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం అన్యాయం అన్నారు. ఐసీడీఎస్ వ్యతిరేక విధానాల అమలు రాష్ట్రంలో వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా 18వేల రూపాయల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, యూనియన్ నాయకులు రాజేశ్వరి, అంజలికుమారి, వనిత, మల్లేశ్వరి, శీలా, జయప్రద, రంభ, జ్యోతి, జయతదితరులు పాల్గొన్నారు.



గ్రూప్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన యువకుడికి సన్మానం

మందమర్రిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే5గనిలో జెఎంఈటీగా పనిచేసిన బొడ్డు తిరుపతి టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల్లో ప్రతభ కనబరచగా గని అధికారులు, కార్మికులు ఘనంగా సన్మానించారు. సోమవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ తిరుపతి సింగరేణి జెఎంఈటీ రాత పరీక్షల్లో సింగరేణి వ్యాప్తంగా 2వ ర్యాంక్‌ను సాధించి జేఎంఈటీ ఉద్యోగం సాధించాడని తెలిపారు. అనంతరం లాంగ్‌లీవ్ తీసుకొని గ్రూప్-4 పరీక్ష రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడన్నారు. ప్రస్తుతం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2 పరీక్ష రాసి 77ర్యాంక్, గ్రూప్-3లో 60 వ ర్యాంక్ సాధించాడన్నారు. ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమంటే మామూలు విషయం కాదన్నారు. ప్రస్తుతం సింగరేణిలో ఉన్నత విద్యావంతులైన కార్మికులు తిరుపతిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గని కార్మికులు తోటి కార్మికులతో పాటు గని అధికారులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, సోవిశెట్టి రాజేశం, ఐఎన్‌టీయూసీ నాయకులు రాంశెట్టి నరేందర్, టీబీజీకెఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, జె రవీందర్, ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీది ద్వంద్వ వైఖరి : టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలం విషయంలో ఐఎన్‌టీయూసీ యూనియన్‌ది ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆందోళలు చేసినప్పుడు ఐఎన్‌టీయూసీ మద్దతు ఇవ్వడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల విధానం ఆనాడు పోరాటం... ఈనాడు ఆరాటం అన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సందర్భంగా 240 గజాల ఇంటి స్థలం, 30 లక్షల రూపాయల వడ్డీ లేని రుణం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ, తదితర హామీల ఇచ్చి 15 నెలలైనా వాటిని అమలు చేయకపోడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. పైగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌ను విమర్శించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తమను విమర్శించడం మానుకొని సింగరేణికి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని సవాల్ విసిరారు. సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, ఉప ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు రమేష్, అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విశ్వాసాన్ని కోల్పోయిన గుర్తింపు సంఘం

ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్

మందమర్రిటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అన్ని రంగాల్లో దారుణంగా విఫలమైందని, కార్మికుల విశ్వాసాన్ని కోల్పోయిందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ విమర్శించారు. సోమవారం స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గత కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో గుర్తింపు సంఘం హోదా కోల్పోయామన్నారు. ఆరు ఏరియాల్లో గెలిచి బాధ్యతాయుతమైన ప్రతిపక్ష సంఘంగా కార్మిక హక్కుల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. సింగరేణిలో కార్మికుల సొంతింటి కలను నిజం చేస్తామని, పెరిక్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. గుర్తింపు సంఘం విధానాలను నాయకులు ఎండగట్టాలన్నారు. కార్మికులకు అందుబాటులో ఉంటూ సమస్యలను కృషిచేయాలని కోరారు. సింగరేణిని కాపాడే శక్తి ఐఎన్‌టీయూసీకే ఉందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం తాము ఎలాంటి త్యాగాలకైన సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలోనే నూతన గనుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరి రాంశెట్టి నరేందర్, పానుగంటి వెంకటస్వామి, గనుల, డిపార్ట్‌మెంట్ల నాయకులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న బ్రహ్మాజీరావును ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓసీపీలో అధిక ఉత్పత్తి సాధించేందుకు బ్రహ్మాజీరావు ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. ఆయనకు ఎంతో భవిష్యత్తు ఉందని, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాక్షించారు.

అనంతరం నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఉత్పత్తి లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఓసీపీ పీవో టి. శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, సంక్షేమాధికారి శంకర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూతన బొగ్గు బ్లాకులు సాధించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య

శ్రీరాంపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులు సాధించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. ఆర్‌కే 5 గనిలో సోమవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గనులు ఇంకో పదేళ్లలో చాలా మూతపడబోతున్నాయన్నారు. అప్పుడు కార్మికులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సింగరేణి మనుగడ కొనసాగించాలంటే నూతన బొగ్గు గనులు అవసరమన్నారు. ఈ తరుణంలో నూతన బొగ్గు బ్లాకుల కోసం సంస్థ వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా 33 వేల కోట్ల రూపాయల బకాయిలు ఇవ్వాలని యాజమాన్యానికి విన్నవించామన్నారు. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు విడతలవారీగా యాజమాన్యంతో మాట్లాడుతూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కానీ ఇతర యూనియన్లు తమను లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. వెంటనే ఆ విధానం మానుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి కలిసి రావాలని కోరారు. సమావేశంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, గొల్లపల్లి రాంచందర్, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, అడ్డు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

విజేతలకు బహుమతుల ప్రదానం

పెంచికలపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లూరు గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో 15 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో హత్తిని గ్రామపంచాయతీ జట్టు గెలుపొందగా ప్రథమ బహుమతి ఆర్ఎంపీ సుధాకర్ రూ.20 వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. అలాగే ద్వితీయ బహుమతి ఎల్లూరు జట్టుకు చప్పిడి రవి రూ.10 వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, జంషీద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

పెంచికలపేట, మార్చి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్పల్లి, కొండపల్లి గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గణపతి మాట్లాడుతూ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు గణపతి, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

సామల సదాశివ సాహితీ పురస్కారానికి గట్టు గణపతి శర్మ ఎంపిక

కాగజ్‌నగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సామల సదాశివ సాహితీ పురస్కారానికి జ్యోతిష విద్వాంసులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు గట్టు గణపతి శర్మ ఎంపికైనట్టు తెలుగు సాహితీ సదస్సు అధ్యక్షుడు పెండ్యాల కిషన్ శర్మ, ప్రధాన కార్యదర్శి మామిడాల తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30 ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ అవార్డును అందజేయనున్నట్టు వారు వివరించారు.

ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

దహెగాం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలోని కొత్తపల్లిలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి. ఎంఈవో సీహెచ్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, శారద, ఉపాధ్యాయులు శ్రీలత, సాయి, కిరణ్ పాల్గొన్నారు.



సామర్థ్యం పెంచేలా

- ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన
- కృత్రిమబోధనతో విద్యార్థులకు మేలు
- వెనుకబడిన పిల్లలకు స్పెషల్‌ క్లాసులు
- జిల్లాలో ఏడు పాఠశాలల్లో ప్రారంభం



జైపూర్‌లో ఏఐ బోధనలు ప్రారంభించిన కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌

నెన్నెల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఏఐ (ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌) హవా నడుస్తున్న వేళ బడి పిల్లల విద్యా సామర్థ్యం మెరుగుపరిచేందుకు ఈ అత్యాధునిక సాంకేతికత ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక విద్యార్థుల రీడింగ్‌, రైటింగ్‌ బేసిక్స్‌ను మరింత బలోపేతం చేసేలా కృత్రిమమేధతో విద్యాబోధనకు చర్యలు చేపట్టింది. జిల్లాలో పైలెట్‌ ప్రాజెక్టుగా 7 స్కూళ్లను ఎంపిక చేయగా, ఈ నెల 15న వాటిని కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌, డీఈవో యాదయ్య ప్రారంభించారు. దశలవారీగా ఏఐను జిల్లాలోని అన్ని పాఠశాలకు విస్తరింపజేయనున్నారు. ప్రాజెక్టు అమలుకుగాను ఒక ఎంఈవో, ఒక కాంప్లెక్స్‌ హెచ్‌ఎం, ఒక ప్రైమరీ స్కూల్‌ టీచర్‌ను రిసోర్సుపర్సన్లుగా ఎంపిక చేసి వారికి హైదరాబాదులో శిక్షణ ఇచ్చారు.

కృత్రిమ మేధ సాయంతో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన విద్యాసామర్థ్యం పెంపొందుతుందని అధికారులు అంటున్నారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు చక్కగా చదవడం, రాయడం, గణితంలో పట్టు సాధించడానికి ఏఐ ఉపయోగడుతుందని చెబుతున్నారు. మారుతున్న కాలానికి అను గుణంగా బోధన, అభ్యాసన ప్రక్రియలకు ఏఐ తోడు కావడంతో సర్కారు బడులు కొత్త పుంతలు తొక్కనున్నాయి.

పైలట్‌ ప్రాజెక్టుకు ఎంపికైన స్కూల్స్‌ ఇవే...

జన్నారం మండలం ముడిమడుగు, లక్షెట్టిపేట మండలం వెంక్రాటావుపేట, హాజీపూర్‌ మండలం రాపల్లి, చెన్నూరు మండలం ఎన్‌పీవాడ, దుగ్నెపల్లి, బెల్లంపల్లి మండలం చాకెపల్లి, జైపూర్‌లలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలను పైలెట్‌ ప్రాజెక్టులో ఎంపిక చేశారు. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌ అందుబాటులో ఉన్న హైస్కూల్స్‌ ఆవరణలోనే ఉన్న ప్రాథమిక పాఠశాలను పైలెట్‌ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల సమయాన్ని బట్టి వారంలో రెండు రోజుల షెడ్యూల్‌ రూపొందించారు. దాని ప్రకారం పైలెట్‌ ప్రాజెక్టుకు ఎంపికైన స్కూళ్లలో ఏఐ బోధనలు సాగనున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే నూతన విద్యాసంవత్సరాని కల్లా అన్ని పాఠశాలల్లో ఏఐ బోధనలకు మొదలు పెట్టేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

3వ తరగతి నుంచే...

ప్రభుత్వ బడులకు వస్తున్న పిల్లల్లో 80 శాతం వరకు పేద విద్యార్థులే ఉంటారు. వారు ఆశించిన స్థాయిలో అభ్యసన సామర్థ్యాలు, చతు ర్విధ ప్రక్రియలైన (ఎఫ్‌ఎల్‌ఎన్‌) కూడిక, తీసి వేత, గుణకారం, భాగహారం చేయడంలో వెనక బడుతున్నారు. తెలుగు, ఇంగ్లీషు చక్కగా చదవలేక, రాయలేక పోవడాన్ని అధికారులు గుర్తించారు.

పలు రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికి ఫలితాలు మెరుగుపడటం లేదు. పాఠశాలల్లో వివిధ పరీక్షలు నిర్వహించి పిల్లలను గ్రేడ్‌లుగా విభజించారు. ప్రతి పాఠశాల నుంచి పది మంది వెనుకబడిన విద్యార్థులను గుర్తించారు. వీరికి కృత్రిమ మేధతో ఏఎక్స్‌ఎల్‌ ప్రోగ్రాం ద్వారా సామర్థ్యాల పెంపు కోసం చర్యలు తీసుకుంటున్నారు. 3, 4, 5 తరగతుల విద్యా ర్థుల ఏఐ లెర్నింగ్‌ టూల్స్‌ ద్వారా బలహీనతలను గుర్తించి వారి సామర్థ్యాలను మెరుగుపరుస్తారు.

ఏఐ బోధన ఇలా

బెంగుళూరు కేంద్రంగా పని చేసే ఏక్‌ స్టెప్‌ ఫౌండే షన్‌ సహకారంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ ద్వారా ఏఐ బోధ న అందిస్తున్నారు. ఏఎక్స్‌ఎల్‌ (అసిస్టెడ్‌ లాంగ్వేజ్‌, అసి స్టెడ్‌ మ్యాథమెటిక్స్‌) ప్రోగ్రాం ద్వారా ఏఐ బోధనలు అందిస్తుంది. 3నుంచి 5 తరగతుల పిల్లల్లో తరగతుల వారిగా పది మంది చొప్పున బ్యాచ్‌ ఏర్పాటు చేస్తున్నా రు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, ఇంగ్లీష్‌, మ్యాథ్స్‌ గూర్చి 20 నిమిషాల పాటు ఏఐ బోధిస్తుంది. తను చె ప్పేది విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడో లేదా అనేది ఏఐ గుర్తించి అర్థం కాకపోతే మరింత సరళంగా బోధ న అందిస్తుంది. అందుకు తగ్గట్టుగానే ఎక్సర్‌సైజ్‌ ఇస్తుంది. ముందుగా కంప్యూటర్‌ స్క్రీన్‌పై ఓ వాక్యం వ స్తుంది. దాన్ని విద్యార్థి చదవడానికి ఇబ్బంది పడితే ఏ ఐ సరైన రీతిలో చదివి వినిపిస్తుంది. విద్యార్థి తెలుగు వాక్య నిర్మాణంలో దీర్ఘాలు, ఒత్తులు తదితర తప్పుల ను గుర్తించి వాటిని సరిచేసుకునే విధంగా అందుకు తగ్గట్టుగానే ఎక్సర్‌సైజు ఇవ్వడం ఏఐ ప్రత్యేకత. ఇలా ఇంగ్లీషు, గణితంలో కూడా అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఏఐ ఉపకరిస్తుంది. విద్యార్థి ప్రగతి దశల వారి ఏఐ విశ్లేషించుకొని అందుకు అనుగుణంగా బోధిస్తుంది. అందుకు తగ్గట్టుగా ప్రతి విద్యార్థి కం ప్యూటర్‌పైన సాధన చేయాల్సి ఉంటుంది.



ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఏఐ ఓ వరంలాంటిది

యాదయ్య, జిల్లా విద్యాశాఖాధికారి



జిల్లాలో ప్రయోగాత్మకంగా ఏడు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధన తగరతులు ప్రారంభించాం. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ను బోధనకు ఉపయోగించడం విద్యారంగంలో విప్లవాత్మక మార్పుగా చెప్పొచ్చు. ప్రైవేటులో చదివించలేని పేద విద్యార్థులకు ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ సాయంతో విద్యా బోధన చేయడం వరం లాంటింది. ఏఐ సాయంతో విద్యార్థికి శాశ్వత జ్ఞానం ఏర్పడి, నేర్చుకునే అంశాలపై కుతూహలం పెరుగుతుంది. కృత్రిమమేధతో విద్యార్థులు తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకునే వీలుంటుంది.

ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయి: ఎస్‌కే హాజిపాషు, పేరెంట్‌



మారతున్న కాలనికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అత్యాదునిక విధానంలో బోధనలు అందించడం ఎంతో అవసరం. ఇలాంటి నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3 వ తరగతి విద్యార్థికి కంప్యూటర్‌ అప్పగించి దాని ద్వారా బోధన అందించి అభ్యసన చేయడం చాలా గొప్ప విషయం. దీంతో సర్కారు బడిపిల్లలు ప్రైవేటు కార్పొరెట్‌ స్కూళ్ల విద్యార్థులతో పోటీపడే స్థాయికి ఎదుగుతారు. కృత్రిమ మేధ సాయంతో విద్యార్థి తన అభ్యస న లోపాలను గుర్తించి వాటిని సవరించుకుంటూ చదువులో ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

కళతప్పిన జీవనది..

(5వ పేజీ తరువాయి)

అప్పటిదాకా నిలువ చేసిన నీటినంతటినీ అధికారులు గేట్లు తెరిచి, దిగువకు వదిలివేశారు. నీరు మొత్తం వెళ్లిపోయాక గోదావరికి నీటికళ త ప్పింది. కాళేశ్వరం సముదాయం నిర్మాణం జరిగిన ఐదేళ్ల తరువాత ఈ పరిస్థితి దాపురించింది.

● అడుగంటుతున్న భూగర్భ జలాలు...

జిల్లాలో గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు మినహా, ఇతర ప్రాజెక్టుల్లో ఎక్కడా కూడా నీటిని నిలువ చేయని కారణంగా నది పూర్తిగా ఎండిపోగా, భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇంతకాలం నదిలో నిండుగా నీరుండటంతో గోదావరి పరివాహక భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. దీంతో ఆయా ప్రాంతాల్లోని బోర్లు, ఇతర నీటి వనరుల్లో నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం గోదావరి పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. గోదావరి తలాపునే ఉన్నా.. గతంలో నీటి ఎద్దడి భయంకరంగా ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం నిర్మాణంతో పరిస్థితులు ఆశాజనకంగా మారగా, ఆ ఆనందం ప్రజల్లో ఎంతోకాలం నిలువ లేదు. ప్రస్తుతం పాతకథే పునరావృతం కానుండగా, భవిష్యత్తులో మంచిర్యాల పట్టణంతోపాటు నది పరి వాహక ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కోక తప్పదు. మరోవైపు ఎల్లంపల్లి ప్రా జెక్టులోనూ నీటి నిల్వలు అంతంత మాత్రమే ఉండటంతో తాగు నీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. ఈ కారణంగా గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు రోజు విడిచిరోజు సరఫరా చేస్తున్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్‌ పోటీల్లో ప్రతిభ

బెల్లంపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ క్రీడా పోటీల్లో బెల్లంపల్లి క్రిష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌ క్రీడాకారులు పతకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్‌ రవి ప్రసాద్‌, ప్రిన్సిపాల్‌ రాజారమేశ్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్‌ -14 బాలికల విభాగంలో నామని సహస్య జావన్‌లిన్‌ త్రోలో గోల్డ్‌మెడల్‌, అండర్‌ -14 బాలుర విభాగంలో పి.జెస్వాల్‌ జావలిన్‌ త్రోలో సిల్వర్‌ మెడల్‌ సాధించారు. అలాగే పి.సిద్దేశ్వర్‌ 400 మీటర్స్‌లో బ్రాంచి మెడల్‌ను, అండర్‌ -16 బాలికల విభాగంలో సింధూజ వందమీటర్‌ జావలిన్‌త్రోలో గోల్డ్‌మెడల్‌ సాధించారు. వ్యాయమ ఉపాధ్యాయులు సంతోష్‌ యాదవ్‌, మల్లేశ్‌ యాదవ్‌, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎస్సీ బాయ్స్‌ హాస్టల్‌ వార్డెన్‌ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘీక సంక్షేమ కార్యాలయంలోని డీడీకి తదితర విద్యార్థి స సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. హాస్టల్‌లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా అరటిపండ్లు, కోడిగుడ్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే విచారణ జరిపించి వార్డెన్‌పై చర్యలు తీసుకొని సస్పెండ్‌ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రవీణ్‌కుమార్‌, క్రాంతి కుమార్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే పీడీయాక్టు నమోదు చేస్తాం

జైపూర్‌, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నది నుంచి అను మతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తే పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్‌ వనజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స మావేశంలో ఆమె మాట్లాడుతూ పోలీసులు, రెవెన్యూ అధికారులు గత ఏడాది కాలంలో 117 ఇసుక డంప్‌లు పట్టుకుని మైనింగ్‌ శాఖకు అప్పగించారన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే అధికారులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ, సీఐ వేణు చందర్‌, ఎస్‌ఐ శ్రీధర్‌, ఎంపీవో శ్రీపతి బాపురావులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్‌, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌ పంచాయతీలోని సుభద్ర కాలనీలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్‌లు ప్రారంభించారు. రూ. 5 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులతో రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు జుబేర్‌, గౌస్‌, జావిద్‌, చాంద్‌ఖాన్‌, రియాజ్‌, ఆసిఫ్‌, మురళీ, హుస్సేన్‌, సమ్మిరెడ్డి, సంతోష్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సీఐ అఫ్జలొద్దిన్‌



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: నకిలి విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. వ్యవసాయాధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. గతంలో నకిలి పత్తివిత్తనాలు విక్రయించిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. తహసీల్దార్ల ముందు బైండోవర్‌ చేస్తున్నాం. అలాగే నకిలీ పత్తివిత్తనాల వల్ల కలిగే దుష్ప్రబావాలపై వ్యవసాయాధికారులతో కలిసి అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో, కళాశాలల్లో ర్యాగింగ్‌ నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

సీఐ : ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలుంటాయని, భవిష్యత్‌ అంధ కారంలోకి వెళ్తుందని, పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళల భద్రత కోసం ప్రత్యేక షీ టీంలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

సీఐ : గంజాయి నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే పది మందిపై సస్పెక్ట్‌ షీట్‌ ఓపెన్‌ చేశాం. గంజాయి వల్ల కలిగే దుష్ప్రబావాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆత్మహత్యల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు...?

సీఐ: పరీక్షల్లో మార్కులు రాలేదని, ఫెయిల్‌ అయ్యామని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు. ఆత్మహత్యల నివారణకు విద్యార్థులకు సైకాలజిస్టులచే సైతం అవగాహన కల్పిస్తున్నాం. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకొని తల్లిదండ్రుల కళలు నెరవేర్చాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దు.

-బెల్లంపల్లి, ఆంధ్రజ్యోతి

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం...

బెల్లంపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి కాడెపు రాజమౌళి, ఏఐటీయూసీ సీనియర్‌ నాయకులు చిప్ప నర్సయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గ జనరల్‌ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో ఆవిర్భవించి ప్రజల పక్షాన పోరాడిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, రత్నం రాజం పాల్గొన్నారు.

సన్న రకం ధాన్యం బోనస్‌ చెల్లించండి

దండేపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): సన్నరకం వరిధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ చెల్లించాలని కోరుతూ దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామ అఖిల పక్ష రైతు సమితి ఆధ్వర్యంలో రైతులు సోమవారం దండేపల్లి డిప్యూటీ తహసీల్దార్‌ విజయకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం కల్పించాలన్నారు. ఇప్పటి వరకు రైతు రుణమాఫి కాని రైతులకు పూర్తిస్థాయిలో పంట రుణమాఫి చేయాలని డిమాండ్‌ చేశారు. ముందుగా కన్నెపల్లి ప్రదాన రహదారిపై వడ్ల బోనస్‌ కోసం రాస్తారోకో చేపట్టేందుకు రైతులు సిద్ధం అయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై తైసోనోద్దీన్‌ సిబ్బందితో అక్కడకు చేరుకుని రైతులను అడ్డుకుని దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాజయ్య, నాయకులు సురేందర్‌, గిరిధర్‌, రైతులు రాజలింగుయ్య పాల్గొన్నారు.



దండేపల్లి డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కన్నెపల్లి రైతులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోటపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు పారుపెల్లి సుప్రియ, నాయిని శ్రీనిజలు అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ సోమవారం తెలిపారు. పోటీల్లో సుప్రియ అండర్‌ 18 విభాగంలో జావెలిన్‌త్రోలో బంగారు పతకం, శ్రీనిజ అండర్‌ 14 విభాగంలో 100, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించిందన్నారు. ఈ విద్యార్థులు ఈ నెల 23న హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం అశోక్‌, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌, సీనియర్‌ ఉపాధ్యాయులు లావణ్య, మదునయ్య అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల నిరసన

బెల్లంపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ సోమవారం తహసీల్దార్‌ కార్యాలయం ముందు ఆశాలు నిరసన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న కలెక్టర్‌ కార్యాలయం ముందు ధర్న చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు ఆశ కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలు సమ్మక్కతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి రూరల్‌, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలంలోని లంబడితండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేశ్‌ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పేకాట స్థావరంపై దాడి చేయగా రూ.3630 నగదు, ఆటో, బైక్‌ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ నిందితులను అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మరో ముగ్గురు పరారిలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మొక్కలను సంరక్షించాలి

వేమనపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో కుమారస్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగారం, బుయ్యారం, జిల్లెడ, సూరారం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ మధుకర్‌ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

నెన్నెల : ఆదిల్‌పేట కాలువ నుంచి మందమర్రి మండలం మామిడిగట్టుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు. డ్రైవర్‌ మోహన్‌, వోనర్‌ మల్లేష్‌పై కేసు నమోదు చేశారు. ట్రాక్టర్‌ను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి తహసీల్దా ర్‌కు స్వాధీనపర్చినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మందమర్రిటౌన్‌: పట్టణంలోని జాతీయ రహదారి అందుగులపేట రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది పడి ఉన్నాడు. ఎస్‌ఐ రాజశేఖర్‌ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై నీలి రంగు షర్టు, జీన్స్‌ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. వయస్సు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్‌ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహం సమాచారం తెలిస్తే 8712656570కు ఫోన్‌ చేయాలన్నారు.

క్రీడా సామాగ్రి పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్‌ : ప్రభుత్వ వైద్య కళాశాల రెండవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడలకు అవసరమైన క్రీడా సామగ్రిని సోమవారం మంచిర్యాల లైన్స్‌క్లబ్‌ సభ్యులు అందజేశారు. రూ. 20వేల విలువ గల క్రికెట్‌ కిట్‌, వాలీ బాల్‌, త్రోబాల్‌, క్యారంబోర్డు, చెస్‌ సెట్‌, షటిల్‌ బ్యాట్స్‌, షటిల్‌ కాక్స్‌ను కళాశాల ప్రిన్సిపల్‌ దావూద్‌ సులేమాన్‌, వైస్‌ ప్రిన్సిపల్‌ రేఖ, జగతి చేతుల మీదుగా అందజేశారు. క్లబ్‌ ప్రోగ్రాం చైర్‌పర్సన్‌ మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షుడు బాల మోహన్‌, కార్యదర్శి కారుకూరి చంద్రమౌళి, సభ్యులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు..

నస్పూర్‌ : నస్పూర్‌ పట్టణంలోని హౌసింగ్‌ బోర్డు కాలనీ శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో సోమవారం సం కటహర చతుర్థి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి మహా ఇక్షు రసాభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ రఘుపతిరావు పాల్గొన్నారు.

నియామకం

మంచిర్యాల క్రైం: తెలంగాణ జాతీయ యాదవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడిగా పెండ్ల అంజన్న యాదవ్‌ను నియమించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ప్రారంభం

భీమారం : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ ఆవరణలో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం విద్యుత్‌ ఎస్‌ఈ గంగాధర్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈలు కైసర్‌, రాజన్న పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్‌ పార్టీ

చెన్నూరు: మండలంలోని పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్‌ సెకండరీ పాఠశాలలో సోమవారం ఫేర్‌వెల్‌ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం దత్తకుమార్‌ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు ఇచ్చారు.

ఆశా కార్యకర్తల వినతి

మందమర్రిరూరల్‌ : ఆశా వర్కర్లకు ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ. 18 వేలు చెల్లించాలని సీఐటీయూ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ నాయకురాల్లు సోమవారం తహసీల్దార్‌ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా

కన్నెపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్‌ పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధా నోపాధ్యాయుడు రమేష్‌ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రజలకు అవగాహన

భీమారం : సుంకరపల్లి గ్రామంలో సోమవారం రాత్రి మూఢనమ్మకాల నిర్మూలనపై ఎస్‌ఐ శ్వేత ఆధ్వర్యంలో కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలన్నారు. పోలీసు కళాబృందం సభ్యులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

బెల్లంపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఎంఆర్‌పీఎస్‌ నాయకులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఆర్థిక రాజకీయ రంగాల్లో సరైన న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందక్రిష్ణ మాదిగ అలుపెరుగని పోరాటాలు చేశారని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి ప్రస్తుతం పట్టించుకోకుండా ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. ఎంఆర్‌పీఎస్‌ నాయకులు రామగిరి మహేశ్‌, చెన్నూరి సమ్మయ్య మాదిగ, జిల్కర శంకర్‌, మోతె రాజేశ్‌ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో రిలే దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా విద్యార్థులకు వీడ్కోలు

జైపూర్‌, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ సెకండరీ పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, ఆటపాటలతో అలరించారు. విద్యా సంవత్సరాన్ని పూర్తి చేసుకుని ఈ నెల 21 నుంచి పరీక్షలకు సిద్ధమై వెళ్తున్న తరుణంలో ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగోత్‌ శ్యాంసుందర్‌ పేర్కొన్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయురాలు ఆలిస్‌మాధుర్యను ముఖ్య అతిథిగా ఆహ్వానించి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ మద్దుల సునీత పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

కోటపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం తహసీల్దార్‌ రాఘవేందర్‌రావు, ఎస్‌ఐ రాజేందర్‌, ఎంపీడీవో లక్ష్మయ్యలతో కూడిన అధికారుల బృందం సందర్శించింది. పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులతో మాట్లాడిన అధికారులు వారికందుతున్న ప్రయోజనాలు, పాఠశాలల్లోని సౌకర్యాలు, సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఎస్సీ హాస్టల్‌లో భవనం, గదుల సమస్యలు ఉన్నాయని విద్యార్థులు అధికారులకు తెలుపగా కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్‌ రాఘవేందర్‌రావు పేర్కొన్నారు.




వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు

5 మంగళవారం 18 మార్చి 2025



పత్తి కొనుగోళ్ల నిలిపివేత

చెన్నూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గత పత్తి జిన్నింగు మిల్లుల వద్ద సీసీఐ పత్తి కొనుగోళ్లు ఈ నెల 14వ తేదీ నుంచి నిలిపివేసినట్లు చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండీ షా హబుద్దీన్ ఒకప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ, చెన్నూరు పరిధిలోని సీసీఐ జిన్నింగు మిల్లులకు పత్తిని తీసుకురావద్దని రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

ఢిల్లీలో ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ధర్నాలో మంచిర్యాల ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి రైలులో ఢిల్లీకి వెళ్లారు. వారు మాట్లాడుతూ పాలసీదారులకు బోనస్ పెంచాలని, పాలసీలపై జీఎస్టీ తీసివేయాలని, కనీస బీమా లక్ష రూపాయలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏజెంట్లు పూర్ణచందర్, వఆసు, సాగర్, మల్లారెడ్డి, రాజన్న, రాజేశం, రాజేష్, మహేందర్, రవీందర్‌రెడ్డి, బాబు, మల్లికార్జునయా దవ్ పాల్గొన్నారు.

చెన్నూరు సీఐగా దేవేందర్‌రావు



చెన్నూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు సీఐగా సోమవారం దేవేందర్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ రవీందర్ బదిలీ కాగా ఆయన స్థానంలో చెన్నూరు సీఐగా దేవేందర్‌రావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బాధ్యతలు స్వీకరించారు.

కళతప్పిన జీవనది..



మంచిర్యాల వద్ద నీరులేక బోసిపోయిన గోదావరి

- నీరు లేక వెలవెలబోతున్న గోదావరి
- ఎడారిని తలపిస్తున్న పుణ్యవాహిని
- కాళేశ్వరం ప్రాజెక్టులు కుంగడంతోనే ఈ దుస్థితి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు

మంచిర్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గలగలా పారుతూ సవ్వడి చేసే గోదావరి ప్రస్తుతం కళ తప్పింది. నీరు లేక వెలవెలబోతూ బోసిగా కనిపిస్తోంది. పుణ్య స్నానాలకు సైతం నీరందించని దీన స్థితిలో ఉంది. ఉగాది, మహాశివరాత్రి, దీపావళి, వినాయకచవితి తదితర పర్వదినాల్లో గోదావరి నదికి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించడం పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తోంది. నది తీర ప్రాంతాలకు చెందిన వారే కాక సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు జిల్లాలోని పలు చోట్ల గోదావరి స్నానం ఆచరించేవారు. ముఖ్యంగా జిల్లాలోని బాసర, గూడెం, మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతాల్లో పవిత్ర దినాల్లో పుణ్యస్నానాల కోసం భక్తులు గోదావరి తీరం వెంట బారులు తీరేవారు.

ఎత్తిపోతలతో జలకళ...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కారణంగా ఐదేళ్లుగా నదిలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండేది. ఎత్తిపోతల ద్వారా 2019 జూలైలో తొలిసారిగా దిగువ నుంచి ఎగువకు నీరు ప్రవహించి, గోదావరి జలకళను సంతరించుకుంది. కాళేశ్వరం నుంచి ఎత్తిపోతల ద్వారా గోదావరి నదిలోకి నీటిని ఎత్తిపోయడంతో అన్నారం, మేడిగడ్డ, అక్కడి నుంచి గోలివాడ సమీపంలోని సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని ఎత్తిపోసేవారు.

సుందిళ్ల పంప్‌హౌజ్ నుంచి వెటర న్ నిర్వహించడం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోసేవారు. దీంతో మంచిర్యాల వద్ద గోదావరి నది లో నీరు ఎల్లప్పుడు పుష్కలంగా ఉండేది.

దక్షిణ భారతంలో ముఖ్యమైనది...

కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుల్లో ప్రవహించే గోదావరి దక్షిణ భారతదేశంలోనే అతి ముఖ్యమైన నది. జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర వద్ద జిల్లాలో ప్రవేశించి తూర్పుదిశ గూడెం మీదుగా కోటపల్లి మండలం దేవులవాడ సమీపంలో జిల్లాను వీడి కాళేశ్వరం త్రివేణి సంగమంలో కలుస్తుంది. కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదితో పాటు అంత ర్లీనంగా సరస్వతీ నదిగా మిళితమవు తుంది. అక్కడి నుంచి మహారాష్ట్రలోని ఇంద్రావతి న దిని కలుపుకొని భద్రాచలం మీదుగా రాజమండ్రి ద్వారా బంగాళాఖాతంలో కలుస్తుంది. తెలంగాణాలో దాదాపు 7వందల కిలోమీటర్ల పొడ వున్న గోదావరి ఉమ్మడి జిల్లాలో సుమారు 2వందల కిలో మీటర్లు పయనిస్తుంది. జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన బాసర, ధర్మపురి, చెన్నూర్, వేలాలలోని మల్లికార్జునస్వామి దేవాలయం పవిత్ర గోదావరి నది ఒడ్డునే ఉన్నందున గోదావరినదిని ప్రకృతివరంగా ప్రజలు భావిస్తారు.

ప్రాజెక్టులు కుంగడంతో ఎడారిలా...

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్మించి, ప్రచారం చేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కుంగడంతో పరిస్థితి చిన్నాభిన్నం అయింది. 2019 జూలై నుంచి 2023 జూలై వరకు నిత్యం నీటితో కళకళలాడిన గోదావరి ప్రస్తుతం నీరులేక ఎడారిని తలపిస్తోంది. జూలైలో గోదావరికి సంభవించిన భారీ వరదల కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయంలో అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు కుంగిపోయిన విషయం తెలిసిందే. దీంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ప్రాజెక్టుల్లో...

మిగతా 7లో

గూడెం ఆలయ హుండీ లెక్కింపు



గూడెం ఆలయంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

దండేపల్లి, మార్చి17 (ఆంధ్రజ్యోతి): గూడెం శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 88 రోజులుగా స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ. 7,15,865 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. హుండిని దేవాదాయ ధర్మదాయశాఖ పర్యవేక్షకులు, సహాయ కమిషనర్ నవీన్, ఆలయ ముఖ్యఅర్చకులు గోవర్ధన రఘస్వామి, వేదపండితులు దుద్దిళ్ల నారాయణశర్మ, భరత్ శర్మ, సిబ్బంది ఆధ్వర్యంలో హుండిని లెక్కించారు. సత్యనారాయణ స్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పాల్గొన్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల కోసం 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 49 మంది ముఖ్య పర్యవేక్షకులు, 49 మంది శాఖ అధికారులు, 4 సీ సెంటర్ కస్టోడియన్‌లను, 461 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

మందమర్రిటౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మంచిర్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దరావత్ చంద్రకళ అన్నారు. సోమవారం పట్టణంలోని మంజునాథ గార్డెన్‌లో నిర్వహించిన విశిష్ట మహిళ అంబేడ్కర్ 2025 అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను గుర్తింపు వారికి అవార్డును ప్రధానం చేయాలనే ఆలోచన గొప్పదని అన్నారు. అనంతరం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎస్. రాజేశ్వరి, మందమర్రి జీఎం దేవేందర్ మాట్లాడారు. కార్యక్రమానికి ఉప్పులేటి నరేశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

చెన్నూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కలీందర్ ఆలీఖాన్ కోరారు. సోమవారం చెన్నూరులో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్‌ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఎర్రజెండా అండగా ఉంటుందని తెలిపారు. అంగన్ వాడీల పట్ల అధికారులు వివక్ష చూపెడుతున్నారన్నారు. నాయకులు పోలు, సమ్మయ్య, చందు, మధునయ్య, నారాయణ, వెంకటేష్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను విజిట్ చేసిన విద్యార్థులు

మంచిర్యాల క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు మంచిర్యాల పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పట్టణ సీఐ ప్రమోద్‌రావు విద్యార్థులకు పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ఉన్నతమైందని, విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షను అలవర్చుకోవాలన్నారు. ఒక లక్ష్యం ఎన్నుకొని దానిని సాధించే దిశగా ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

కలెక్టర్ కుమార్ దీపక్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జైపూర్, కోటపల్లి, కన్నెపల్లి, జన్నారం, మంచిర్యాల, లక్షెట్టిపేట, దండేపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

నస్పూర్ : నస్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చాయి. రెండు ప్రభుత్వ భూములపై, ఒకటి పట్టా భూమి పై దరఖాస్తులు అందజేశారు. పరిశీలిస్తామని అధికారులు దరఖాస్తుదారులకు చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాస్, సీసీసీ నస్పూర్ ఎస్సైలు నెల్కి సుగుణాకర్, సంతోష్, మేనేజర్ కరుణాకర్ పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. పూర్తిస్థాయి అధికారులు హాజరుకాలేదు. ఎంపీడీవో మోహన్, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

జైపూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామపంచాయతీల ప్రజలు ఎటువంటి సమస్యలున్నా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవ చ్చని తెలిపారు. ఆయాశాఖల అధికారులు గ్రామ ప్రజలకు ప్రజావాణి కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఎస్ఐశ్రీధర్, వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్‌స్టన్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బాలయ్య పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్ దరకాస్తులు స్వీకరిం చారు. ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి 15రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మారుతిప్రసాద్, ఎంపీడీవో సరోజ, ఎస్సై సతీష్, ఏవో శ్రీకాంత్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మి పాల్గొన్నారు.

వేమనపల్లి : మండల స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గత సోమవారం నుంచి ప్రారం భమైన ప్రజావాణి కార్యక్రమానికి వేమనపల్లి మండలంలో స్పందన కనిపించడం లేదు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. ఎస్ఐ శ్యామ్ పటేల్, రెవెన్యూ సిబ్బంది హాజరైనప్పటికి ఫిర్యాదు దారులు ఎవరు రాలేదు. కాగా మండలంలో చాలా భూ సమస్యలున్నా ప్రజావాణి గురించి ప్రచారం లేకపోవడం, ఒకటి రెండు వచ్చిన దరఖాస్తులను పరిష్కరిం చడంలో అధికారులు విఫల మవడంతో ఈ కార్యక్రమంపై రైతులు అనాసక్తితో ఉన్నారు. సంబంధిత అధికారులు రైతులకు ప్రజావాణిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వార సంత.. సమస్యల చింత
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

6

సామర్థ్యం పెంచేలా..
- ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన
- కృత్రిమ బోధనతో విద్యార్థులకు మేలు
- జిల్లాలో ఏడు పాఠశాలల్లో ప్రారంభం

7

నేడు వార సంత వేలం పాట

తాండూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేచిని గ్రామంలో మంగళవారం ఉదయం 11 గంటలకు వారసంత వేలం పాట నిర్వహిస్తున్నట్లు రేచిని పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల వరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

●కొత్తపల్లి గ్రామపరిధిలో నిర్వహించే శనివారం మేకల మార్కెట్, కూరగాయల మార్కెట్ వారసంత వేలం పాట ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు కొత్తపల్లి పంచాయతీ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల లోపు మేకల మార్కెట్‌కు రూ. 50 వేల డిపాజిట్, కూరగాయల సంతకు రూ. 25 వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు

కరాటే, కుంగ్‌ఫూలో ప్రతిభ

బెల్లంపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో జరిగిన నేషనల్ లేవెల్ ఓపెన్ టు ఆల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో సీఓఈ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు విజ్ఞాన్, విష్ణువర్ధన్, శివ రుత్విక్, అర్జున్ ప్రసాద్‌లు పోటీల్లో ప్రతిభ కనబరిచిగోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని తైక్వాండో అధ్యక్షుడు చిరంజీవి తెలిపారు. తాండూర్ మండలంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాలకు చెందిన పార్థమోక్షిత్, సాత్విక్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కోచ్ శ్రావణి, కరస్పాండెంట్ సురభి శరత్ అభినందించారు.

సమస్యలను పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల మహాధర్నా



కలెక్టరేట్ ఎదుట మహా ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

నస్పూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో 48గంటల మహాధర్నాను చేపట్టింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శి భానుమతి, రా జమణి మాట్లాడుతూ ప్రతి నెల ఒకటవ తేదిన వేతనాలు చెల్లించాలన్నారు. ఐసీ డీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీపథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంట ర్లను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దన్నారు. టీచర్స్, హెల్పర్స్‌లకు గ్రాట్యుటీ వ ర్తింపు పర్మనెంట్ చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎ న్నికల మేనిఫేస్టోలో పెర్కొన్న ప్రకారం రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు.

మినీ టీచర్స్‌కు 10నెలల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. మంత్రి సీతక్క హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెం చుతూ కొత్త జీవో ఇవ్వాలన్నారు. ఏలాం టి షరతులు లేకుండా ఆసరా పెన్షన్స్ అమలు చేయాలన్నారు. తదితర 23 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టామన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, జిల్లా ఉపాధ్య క్షులు ప్రకాష్, నాయకులు దూలం శ్రీనివాస్, దేవరాజ్, అంగన్‌వాడీ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ, అనురాధా, మహేశ్వరి, పద్మా, విరోనిక, సంధ్యా, వికో ్టరియా, పద్మ, సబితా పాల్గొన్నారు.

అం గన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ చేపట్టిన అం దోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయ కులు అశోక్, మత్స్య కారుల సంఘం జిల్లా కార్యదర్శి బొడంకి చందు, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాము వివిధ సంఘాల నేతలు మద్దతు తెలిపారు.